నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, మంగళవారం 31 డిసెంబర్ 2024 | YADADRI BHUVANAGIRI

జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు జలాల్‌పూర్ విద్యార్థులు

నవదీప్

చందన

బొమ్మలరామారం, డిసెంబర్ 30 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 సాఫ్ట్ బాల్ క్రీడా పోటీల్లో మండలంలోని జలాల్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గజ్జెల్లి నవదీప్,జాగిళ్లపురం చందన జనవరి 5 నుంచి 9 వరకు మహారాష్ట్రలోని జల్గావులో జరిగే జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ర్యాకల వీరేశం సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం తడక రాజు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

మొదట ఐఐహెచ్‌టీ.. నేడు ఆర్మీ కాలేజ్

జిల్లా నుంచి ప్రఖ్యాత విద్యా సంస్థల తరలింపు

- ఒక్కొక్కటిగా తీసుకెళ్తున్న ప్రభుత్వం
- మధ్యలో మెడికల్ కాలేజీ తరలింపునకు కుట్ర.. ప్రజా వ్యతిరేకతతో వెనక్కి!
- కనీసం పట్టించుకోని జిల్లా ప్రజాప్రతినిధులు
- ఇక్కడే కొనసాగించాలని జిల్లావాసుల డిమాండ్

జిల్లాలోని ప్రఖ్యాత ఇనిస్టిట్యూట్లు ఒక్కొక్కటిగా తరలిపోతున్నాయి. ఇటీవల ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీని కాంగ్రెస్ ప్రభుత్వం ఫోర్త్ సిటీకి తరలించగా, తాజాగా ఆర్మీ మహిళా కళాశాలను సైతం జిల్లాను దాటించింది. మధ్యలో యాదగిరిగుట్ట మెడికల్ కళాశాలను కొండగల్‌కు తరలించాలనే కుట్ర చేసినప్పటికీ.. తీవ్ర వ్యతిరేకత రావడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. పట్టించుకోవాల్సిన జిల్లా ప్రజాప్రతినిధులు మాత్రం తమకేమీ పట్టనట్లు చోద్యం చూస్తున్నండడంపై జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ)

ఆర్మీ మహిళా కాలేజీ ఖాళీ చేయడంతో తొలగించిన ఆర్మీ ఎక్విప్‌మెంట్

నాడు పోచంపల్లి ఐఐహెచ్‌టీ ఖతం..

ఎన్నో పోరాటాలు, ఉద్యమాలతో భూదాన్‌పోచంపల్లి సాధించుకున్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ)ని కాంగ్రెస్ సర్కారు తరలించుకుపోయింది. హైదరాబాద్‌లోని ఫోర్త్ సిటీలో నిర్మించనున్న స్కిల్ యూనివర్సిటీకి అప్పజెప్పింది. ఈ ఏడాది ప్రారంభంలో రాష్ట్రానికి కేంద్రం ఐఐహెచ్‌టీని మంజూరు చేసింది. మొదట భూదాన్‌పోచంపల్లిలో ఏర్పాటుకు నిర్ణయించారు. ఈ మేరకు ఆగస్టు రెండున చేనేత, జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యార్ జీఓ నంబర్ 11 విడుదల చేశారు. తాత్కాలికంగా హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు యూనివర్సిటీలో క్యాంపస్ ఏర్పాటు చేశారు. జీఓలోనూ ఇదే విషయాన్ని స్పష్టంగా పేర్కొన్నారు. మండలంలోని కనుముక్కలలో ఏర్పాటుకే కేంద్రం అప్రూవల్ ఇచ్చిందని అందులో చెప్పుకొచ్చారు. దాంతో మొదటి విద్యా సంవత్సరం కోసం పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ క్యాంపస్ నుంచే ప్రక్రియ కొనసాగించారు. ఏడాది తర్వాత పోచంపల్లికి వస్తుందని అంతా భావించారు. కానీ రేవంత్ రెడ్డి మాత్రం వచ్చే ఏడాది నుంచి ఫోర్త్ సిటీలోని ఇండియా స్కిల్ యూనివర్సిటీలో ఏర్పాటు చేస్తామని కుండబద్ధలు కొట్టారు. దాంతో పోచంపల్లికి ఐఐహెచ్‌టీ వచ్చినట్లే వచ్చి వెళ్లిపోయింది.

మెడికల్ కాలేజీ తరలింపునకూ ప్రయత్నాలు!

ఈ ఏడాది ఫిబ్రవరిలో యాదగిరిగుట్టకు మంజూరైన మెడికల్ కాలేజీని సైతం తరలించుకుపోవాలనే కుట్రలు జరిగాయి. ఏవేవో కారణాలు, సాకులు చెప్పి ఖతం పట్టించాలనే ప్లాన్ చేశారు. ఇక్కడి నుంచి కాలేజీని తీసుకెళ్లి సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొండగల్‌లో ఏర్పాటు చేయాలనే ప్రయత్నాలు జరిగాయి. దీనిపై అప్పట్లో మీడియాలో పెద్దఎత్తున వార్తలు వచ్చాయి. బీఆర్ఎస్‌తోపాటు ఇతర పార్టీలు, జిల్లా ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. కానీ యాదగిరిగుట్టలో ఏర్పాటు చేయాల్సిన కాలేజీని తాత్కాలికంగా భువనగిరిలో కొనసాగిస్తున్నారు.

ఇప్పుడు ఆర్మీ మహిళా కాలేజీ..

త్రివిధ దళాల్లో మహిళలకు అవకాశాలు పెరిగాయి. విద్యార్థినులకు అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో కేసీఆర్ హయాంలో 2018లో జిల్లాకు ఆర్మీ మహిళా కాలేజీ మంజూరైంది. ఇది దేశంలోనే ఏకైక కాలేజీ. ఇటీవల వరకు బీబీనగర్ మండలంలోని రాఘవాపురంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక మహిళా డిగ్రీ కళాశాలలో నడిచేది. ఇక్కడ ఉచిత విద్యా బోధనతోపాటు మహిళలను మానసికంగా, శారీరకంగా సంసిద్ధులను చేసి దేశ రక్షణలో భాగస్వాములను చేసేందుకు శిక్షణ ఇచ్చేవారు. ఈ కాలేజీలో సుమారు 350 మంది విద్యార్థినులు ఉన్నారు. ఇక్కడ చదువుకున్న అనేకమంది స్టూడెంట్లు ఉన్నత స్థానాలకు చేరుకున్నారు. ఆరేండ్లుగా సక్రమంగా కొనసాగుతున్న కళాశాలను ఉన్నఫలంగా జిల్లా నుంచి తరలించారు. రాత్రికి రాత్రే కాలేజీని ఖాళీ చేశారు. అక్కడ ఆర్మీ ఎక్విప్‌మెంట్‌ను గందరగోళంగా తొలగించి చెల్లాచెదురుగా పడేశారు. అంతిమంగా ఘట్‌కేసర్ పరిధిలోని ఓ కళాశాలకు తరలించారు. ప్రస్తుతం విద్యార్థినులకు అక్కడ ఎలాంటి శిక్షణా కూడా ఇవ్వడం లేదు. కాగా, బీబీనగర్ మండలంలోని అన్నంపట్లలో ఓ కళాశాల ఉన్నప్పటికీ ఇక్కడ కొనసాగించేందుకు విముఖత చూపుతున్నట్లు తెలిసింది.

పట్టించుకోని ప్రజాప్రతినిధులు..

సాధారణంగా ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి.. జిల్లాకు కొత్త ప్రాజెక్టులు, సంస్థలు తీసుకొస్తారు. కానీ జిల్లా ప్రజాప్రతినిధులు మాత్రం ఇందుకు భిన్నంగా ఉన్నారు. కొత్త సంస్థలు తీసుకురావడం దేవుడెరుగు! జిల్లాలో ఉన్న సంస్థలను కూడా తరలించుకుపోకుండా కాపాడలేకపోతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ప్రముఖ ఇనిస్టిట్యూట్లు ఉండటం వల్ల అనేక విధాలుగా మేలు జరుగుతుందని, ఆ దిశగా నేతలు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జిల్లాలోనే కొనసాగించాలి.

యాదాద్రి భువనగిరి జిల్లాకు ఓ ప్రత్యేకత ఉంది. ఎన్నో విధాలుగా అభివృద్ధి చెందుతున్నది. ఇందులో భాగంగా ప్రముఖ సంస్థలు ఇక్కడికి వస్తున్నాయి. పోచంపల్లికి ఐఐహెచ్‌టీమంజూరైంది. కానీ కాంగ్రెస్ సర్కారు హైదరాబాద్ తరలించుకుపోయింది. ఇప్పుడు బీబీనగర్ ఆర్మీ మహిళా కాలేజీని ఖాళీ చేశారు. బీబీనగర్ మండలంలోని అన్నంపట్లలో ఏర్పాటు చేస్తామని చెప్పినప్పటికీ.. ఏవేవో కారణాలు చెబుతూ జిల్లాను దాటించేశారు. ఆర్మీ కాలేజీని జిల్లాలోనే కొనసాగించాలి. ఇందుకోసం ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి.

- కొలుపుల అమరేందర్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు

నల్లగొండలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నేతలు కూనంనేని, పల్లా వెంకట్‌రెడ్డి, నెల్లికంటి తదితరులు

బీజేపీ, ఆర్ఎస్ఎస్ నుంచి దేశాన్ని విముక్తి చేయాలి

- అంబేద్కర్‌పై వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను మంత్రివర్గం నుంచి తొలగించాలి
- సీపీఐ శత వసంతాల ఉత్సవాల్లో ఆ పార్టీ జాతీయ కార్యదర్శి డి.రాజా
- ఆది నుంచి పోరాటాలకు ఎర్రజెండా ఊపిరి పోసింది : సురవరం
- ఎర్ర జెండాలన్నీ ఒక్కటి కావాలి : కూనంనేని

నల్లగొండ, డిసెంబర్ 30 : దేశ రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణకు మతతత్వ ఫాసిస్టు అయిన ఆర్ఎస్ఎస్, బీజేపీ నుంచి భారతదేశాన్ని విముక్తి చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా ప్రజలకు పిలుపునిచ్చారు. ఇందుకు దేశంలో ఉన్న అన్ని ప్రజాస్వామ్య, లౌకిక, వామపక్షాలు ఐక్యంగా పోరాటం చేయాలన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాలలో సోమవారం సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట రెడ్డి అధ్యక్షతన సీపీఐ వంద వసంతాల ఉత్సవాల సందర్భంగా బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డి.రాజా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నాడు స్వాతంత్ర్యం కోసం మహాత్మాగాంధీతో కలిసి కమ్యూనిస్టులు పోరాటం చేశారని, అదే స్ఫూర్తితో మరోసారి పోరుబాట పట్టి ఆర్ఎస్ఎస్, బీజేపీని తరిమి కొట్టాలని అన్నారు. వందేండ్ల కింద స్థాపించిన సీపీఐ దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని నినదించిన మొదటి పార్టీగా పేర్కొన్నారు. భారత రాజ్యంగ నిర్మాత అయిన అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను మోదీ సమర్థిస్తూ మంత్రి వర్గంలో ఉంచడం సరికాదని, వెంటనే ఆయన్ను మంత్రి వర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కోట్లకు అధిపతులైన అంబానీ, అదానీకి అండగా ఉంటున్న మోదీ వారికి నిత్యం సంసద సృష్టించి పెట్టడంలో బిజీగా ఉన్నాడని విమర్శించారు. అనంతరం ఆ పార్టీ మాజీ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ భారత్‌లో 1925లో ఆవిర్భవించిన సీపీఐ బ్రిటీష్ సామ్రాజ్య వాదుల కుట్ర కేసుల్లో ఇరుక్కున్న సందర్భంలో అనేక మంది సుదీర్ఘ జైలు జీవితం అనుభవించినట్లు తెలిపారు. సాయుధ పోరాటంలో సీపీఐ చేసిన త్యాగాలు వెలకట్టలేనివని, ఆ పోరాటాల్లో 4500 మంది అమరులయ్యారని, ఆ ఫలితంగానే 1948లో తెలంగాణ భారత యూనియన్‌లో విలీనం అయినట్లు తెలిపారు. నల్లగొండ జిల్లా అంటేనే పోరాటాల ఖిల్లా అని, రావి నారాయణ రెడ్డి మొదలు..దొడ్డి కొమురయ్య వరకు ఈ జిల్లా వాసులేనని అన్నారు. అనంతరం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే దేశంలో ఉన్న ఎర్ర జెండాలన్నీ ఒక్కటి కావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు న్యాయబద్ధంగా చేసిన ప్రతి చట్టంలో కమ్యూనిస్టులదే ప్రధాన పాత్రగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు, శ్రేణులు పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. కళాకారుడు నర్సింహ ఆధ్వర్యంలో పలు పాటలతో కార్యకర్తలను ఉర్రూతలూగించారు. సభకు వచ్చిన సీపీఐ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఎర్రదుస్తులు ధరించి రావటంతో ఎన్‌జీ కళాశాల ప్రాంగణం ఎరుపుమయమైంది. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు సీనియర్ సీపీఐ నేతలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాష, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, పశ్య పద్మ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవణ్ శంకర్, బాల నర్సింహ, బాగం హేమంత్ రావు, ఈటీ నర్సింహ, వీఎస్ బోస్, నల్లగొండ, యాదాద్రి, సూర్యాపేట జిల్లా కార్యదర్శులు నెల్లికంటి సత్యం, గోదా శ్రీరాములు, బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, గన్నా చంద్రశేఖర్, పల్లా నర్సింహా రెడ్డి, ఉజ్జిని రత్నాకర్ రావు, మల్లేపల్లి ఆదిరెడ్డి, ఉజ్జిని యాదగిరి రావు, పువ్వాడ నాగేశ్వర్ రావు, కందిమల్ల ప్రతాప్ రెడ్డి, మోహినొద్దీన్, దొడ్డ నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేసే వరకూ సమ్మె విరమించం

- కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగుల భిక్షాటన

కలెక్టర్ కార్యాలయం వద్ద భిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

భువనగిరికలెక్టరేట్, డిసెంబర్ 30 : సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసే వరకూ సమ్మె విరమించేది లేదని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మంగ పాండరి అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం వద్ద చేపడుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె సోమవారం 21వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఉద్యోగులు భిక్షాటన చేపట్టి నిరసన తెలిపారు. అనంతరం పాండరి మాట్లాడారు. సమగ్ర శిక్ష ఉద్యోగులతో ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయించుకుంటున్నదని, రెగ్యులరైజ్ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నదని అన్నారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించే వరకూ వివిధ కార్యక్రమాలు చేపడూ సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకలకు సన్నద్ధం

ఉత్సాహంగా గడిపేందుకు జనం ఏర్పాట్లు

- మార్కెట్లలో కేకులు, స్వీట్ల అమ్మకాలకు సిద్ధం
- రాత్రి 10గంటల తర్వాత డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు
- నిబంధనలు పాటించాలంటున్న పోలీసులు

రామగిరి, డిసెంబర్ 30 : 2024 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త ఏడాదికి స్వాగతం పలికేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జనం సిద్ధమవుతున్నారు. ఆటపాటలతో ఉత్సాహంగా గడిపేందుకు ముఖ్యంగా యువ త ప్లాన్ చేసుకున్నారు. దాంతో విందు వినోదాలు పెద్ద ఎత్తున సాగనున్నాయి. స్వీట్లు, కేకులు, పటాకుల అమ్మకాలు జోరుగా సాగనున్నందున అందుకనుగుణంగా మార్కెట్లు సిద్ధమయ్యాయి. మం గళవారం సాయంత్రం నుంచే వేడుకల్లో జనం మునిగి తేలనుండగా పోలీసులు పలు ఆంక్షలు విధించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేయొద్దని, అర్ధరాత్రి తర్వాత బయట తిరుగొద్దని పలు నిబంధనలు విడుదల చేశారు. రాత్రి 10గంటల తర్వాత మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

పోలీసుల ఆంక్షలు ఇవే..

- 31న రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే బైండోవర్ చేస్తారు. మైనర్లకు వాహనాలు ఇవ్వద్దు.
- వైన్స్‌లకు రాత్రి 12గంటల వరకు, బార్ అండ్ రెస్టారెంట్లకు రాత్రి 1 వరకు విక్రయాలకు అనుమతి ఉన్నది. దుకాణదారులు సమయ పాలన పాటించాలి.
- గంజాయి, డ్రగ్స్ ఇతర మాదక ద్రవ్యాలు సేవించే వారిపై నిఘా ఉంటుంది.
- ట్రిపుల్ రైడింగ్, రాంగ్ రూట్, హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే చర్యలు.
- ఆరుబయట మద్యం సేవించొద్దు. గ్రూపులుగా తిరుగొద్దు.
- డీజే, ఆర్కెస్ట్రా, పటాకులు కాల్చడం నిషేధం.
- అన్ని ప్రాంతాల్లో పోలీసుల గస్తీ, మఫ్టీలో పోలీసుల నిఘా ఉంటుంది.

ఆలేరు పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతున్న సీపీ

మద్యం సేవించి రోడ్లపై తిరిగితే కేసులు

రాచకొండ సీపీ సుధీర్‌బాబు

ఆలేరు టౌన్ : నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో మద్యం సేవించి రహదారులపైకి వచ్చే వారిపై కేసులు నమోదు చేస్తామని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు అన్నారు. ఆలేరు పోలీస్ స్టేషన్‌ను సోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేసి విలేకరులతో మాట్లాడారు. డిసెంబర్ 31, జనవరి 1వ తేదీల్లో న్యూ ఇయర్ వేడుకలను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని, ఇందుకోసం పోలీసు నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. రహదారులపై సివిల్, ట్రాఫిక్ పోలీసు విభాగాల ఆధ్వర్యంలో తనిఖీలు ఉంటాయన్నారు. ఆయన వెంట యాదాద్రి ఏసీపీ రమేశ్‌కుమార్, సీఐ కొండల్ రావు, ఎస్ఐ కె.రజనీకర్ ఉన్నారు.

టీచర్స్ ఎమ్మెల్సీ ఓటర్లు 24,905

తుది ఓటర్ల జాబితా వెల్లడి.. ఫిబ్రవరిలో ఎన్నికల షెడ్యూల్!

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	ఓటర్ల సంఖ్య
నల్లగొండ	37	4,483
సూర్యాపేట	23	2,637
యాదాద్రిభువనగిరి	17	921
సిద్దిపేట	4	163
జనగాం	12	921
హన్మకొండ	15	5,098
వరంగల్	13	2,225
మహబూబాబాద్	16	1,618
భూపాలపల్లి	7	323
ములుగు	9	612
భద్రాద్రి	23	1,949
ఖమ్మం	24	3,955
మొత్తం	200	24,905

నల్లగొండ ప్రతినిధి, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : నల్లగొండ-ఖమ్మం-వరంగల్ శాసన మండలి ఉపాధ్యాయ నియోజవర్గానికి సంబంధించిన తుది ఓటర్ల జాబితా విడుదలైంది. మొత్తం 24,905 మంది ఓటర్లతో కూడిన జాబితాను కలెక్టర్ ఇలా త్రిపాఠీ వెల్లడించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు గత అక్టోబర్ ఆరంభం నుంచే ఓటర్ల నమోదుకు షెడ్యూల్‌ను విడుదల చేశారు. దీని ప్రకారం గత నెల 6 వరకు ఓటర్ల నమోదుకు అవకాశం కల్పించారు. దాంతో నియోజకవర్గం పరిధిలోని 12 జిల్లాల నుంచి ఓటు హక్కు కోసం మొత్తం 28 వేల మందికి పైగా ఉపాధ్యాయులు, అధ్యాపకులు దరఖాస్తు చేసుకున్నారు. వాటిని పలు దఫాలుగా పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం లేని దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. ఇవి పోగా గత నెల 23న మొత్తం 22,554 మంది ఓటర్లతో ముసాయిదా ఓటర్ల జాబితాను సిద్ధం చేశారు. దీనిపైనా తిరిగి అభ్యంతరాలను స్వీకరిస్తూ... ఇదే సమయంలో కొత్తగా దరఖాస్తులకు అనుమతించారు. దాంతో కొత్తగా 2,351 మంది ఓటర్లు పెరిగారు. వీటన్నింటి అనంతరం తుది జాబితాను సిద్ధం చేసి సోమవారం తుది ఓటర్ల జాబితా వెల్లడించారు. మొత్తం 12 జిల్లాల పరిధిలోని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్ల సంఖ్య 24,905గా నమోదైంది. అందులో పురుషులు 14,940 మంది, మహిళలు 9,965 మంది ఉన్నారు. 2019 మార్చిలో జరిగిన ఎన్నికల్లో 20,888 మంది ఓటర్లుగా ఉన్నారు. ఈసారి అదనంగా 4,017 మంది ఓటర్లు నమోదయ్యారు. ఈ తుది ఓటర్ల జాబితా ఆధారంగానే వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు షెడ్యూల్‌ను విడుదల చేసి మార్చిలో పోలింగ్ నిర్వహించనున్నారు. ప్రస్తుతం ఈ స్థానం నుంచి టీఎస్ యూటీఎఫ్‌కు చెందిన అలుగుబెల్లి నర్సిరెడ్డి ఎమ్మెల్సీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయన పదవీ కాలం వచ్చే ఏడాది మార్చితో ముగియనున్న నేపథ్యంలో త్వరలోనే ఎన్నికల నిర్వహణకు ఎన్నికల కమిషన్ సన్నద్ధవుతున్నది. ఇక పోలింగ్ కేంద్రాల సంఖ్య కూడా గతంలో 181 ఉండగా, ఈసారి 200కి పెరిగింది. అదనంగా 19 పోలింగ్ కేంద్రాలు రానున్నాయి. కాగా, ఇప్పటికే ప్రధాన సంఘాల నుంచి అభ్యర్థులు ఖరారయ్యారు. టీఎస్ యూటీఎఫ్ నుంచి ప్రస్తుత ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మరోసారి అభ్యర్థిగా ప్రచారంలోకి దిగారు. పీఆర్‌టీయూ నుంచి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి, టీచర్స్ జాక్ పేరుతో మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, మరో సంఘం నుంచి హర్షవర్ధన్‌రెడ్డి ఓటర్లను కలుస్తున్నారు. తుది జాబితా వెల్లడి కావడంతో మరింత ముమ్మరం ప్రచారం చేసేందుకు ఆయా సంఘాల అభ్యర్థులు సన్నద్ధమవుతున్నారు.

ముగిసిన టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలు

- విద్యాభివృద్ధి కోసం పలు తీర్మానాలు ఆమోదం
- రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక.. అధ్యక్ష, కార్యదర్శులుగా చావ రవి, వెంకట్

టీఎస్‌యూటీఎఫ్ 2025 డైరీ, కాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ అల్లుబెల్లి నర్సిరెడ్డి, ఆ సంఘం నేతలు

రామగిరి, డిసెంబర్ 30 : తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర 6వ మహాసభలు నల్లగొండలోని లక్ష్మీగార్డెన్స్‌లో సోమవారం విజయవంతంగా ముగిశాయి. చివరి రోజు సాగిన ప్రతినిధుల సభలో మహాసభ ఆహ్వాన సంఘం చైర్మన్, ఎమ్మెల్సీ అల్లుబెల్లి నర్సిరెడ్డి, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.జంగయ్య, చావ రవితోపాటు పలువు నేతలు పలు అంశాలపై చర్చించి తీర్మానాలు ప్రవేశపెట్టారు. జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ - 2020)ని రద్దు చేయాలని, అందరికీ ఆమోదయోగమైన శాస్త్రీయ విద్యా విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు శాపంగా మారిన సీపీఎస్, యూపీఎస్ విధానాలను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్. రాములు, కోశాధికారి లక్ష్మారెడ్డి, పి.మాణిక్‌రెడ్డి, నల్లగొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బక్కా శ్రీనివాసాచారి, పెరుమాళ్ల వెంకటేశం, కోశాధికారి నర్రా శేఖర్‌రెడ్డి, నలపరాజు వెంకన్న, మాజీ అధ్యక్షుడు ఎడ్ల సైదులు పాల్గొన్నారు. నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా చావ రవి, ఎ.వెంకట్‌తోపాటు కార్యవర్గం ఎన్నిక చేయగా దానిలో నల్లగొండ జిల్లా నేతలకు కీలక పదవులు దక్కాయి. వీరిలో రాష్ట్ర కార్యదర్శులు నల్లగొండ జిల్లా నుంచి ఎం. రాజశేఖర్‌రెడ్డి, జి.నాగమణి, సూర్యాపేట జిల్లా నుంచి సీహెచ్. రాములు ఉన్నారు. కుటుంబ సంక్షేమ నిధి చైర్మన్‌గా జిల్లా వాసి ఎం.రాజశేఖర్ రెడ్డి, కోశాధికారిగా ఎడ్ల సైదులుకు అవకాశం దక్కింది. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ 2025 డైరీ, కాలెండర్‌ను ఆవిష్కరించారు.